# నీడలు

'ఊహాప్రపంచంలో ఏవేవో ఆశలు పెట్టుకుని సంచరించే ప్రేమికుని వలపుతలపులివి. ఎంత హృదయంగమంగా ఉన్నవి?

దేవీ!

చూస్తూవుండగానే మళ్లీ శీతాకాలం వచ్చింది. ఇంకా నీ ప్రేమలేఖమీద ఆశవుంది. రోజూ రిక్తహస్తాలతోవచ్చే మా నౌకరునుచూస్తే, ఈవేళకూడా నాదేవి నిర్లక్ష్యంచేసిందా యనుకొని, లోపలవచ్చే కన్నీటి ప్రవాహాన్ని, లోలోపలనే అరికట్టి, తప్పకుండా మరునాడు వస్తుందని ఆశిస్తాను. మరునాడుకూడా అంతే! యథా కన్నీటిధార. మళ్లీ Next day కి Postponement.

మనం ఈ రోజుల్లోనే పిచ్చిపిచ్చిపనులు చేసే వాళ్లంకమూ? గజగజవణికించేచలిలో, నేను వస్తూంటే, గృహములో చేరేచంద్రుడు చెట్లపొదలలోనుండి తొంగి చూస్తూంటే, పక్షుల కిలకిలా రావాలు, కాకుల కావు కావులు, గుళ్లోనిగంట, సాధువు మేలుకొల్పులు— జ్ఞాపకానికి వస్తున్నాయా?

ఒకనాడు జామిచెట్టుక్రింద మనం—కాదు— మన నాలుగుఅధరాలు ఏమేమో చేస్తూవుంటే, దేవతలు పూలవర్షం కురిపించినట్లు మీ రామచిలుకేగదూ జామి పండను మనముందు పడవేసినది. ఆ పండునుమనిద్దరం సమానంగాపంచుకొని తిన్నాం. జ్ఞాపకం వుందా?

అబ్బా! ఆ చలిలో నీ చిన్నచేతులు నాబుగ్గలను పట్టుకొని ముద్దుపెట్టుకుంటున్నప్పుడు ఎంత చల్లగా నుండేవి దేవీ! చలిపోవడానికి మంటవద్ద కూర్చుండే వాళ్లంకమూ నీవు పాఠం చదువుతూంటే. అసలు నీవు పాఠం చదివేదానివా, నేనున్నంతసేపూ? పెంకిపనులు చేయడంతప్ప. ముద్దులు—యిచ్చి పుచ్చుకోవడంతప్ప నీకేపనీ చేతగాదన్నావుగదూ? అవును, ముద్దులుతప్ప నీకేమీ తెలియకపోవటమే నా అదృష్టం.

•

ఒకనాడు నీవు తెల్లకోకకట్టుకొని, నావడిలో నిద్రపోతున్నప్పుడు (దొంగనిద్రలే) మనప్రక్కనేవున్న మల్లిచెట్టు—అప్పుడే మొగ్గలు వికసించి పకపకమని నవ్వుతూ గోలచేస్తూంటే, పువ్వులు తలలో పెట్టుతూ, "—నీకు తెల్లకోక ఎంతో అందం. అచ్చం దేవకన్యక వనుకొని లోలోన మురిసిపోతుంటా" అని అనలేదూ? అందుకని ఒక Special ముద్దు యిచ్చావు జ్ఞాపక ముందా?

నీవు రోజూ—నాకు పంపించేదానివి. ఏమో తెలుసా? నీ ముద్దయినపేరే...యిందులో వ్రాద్దామను కుంటా. ఏమో నీకు తెలియకుండా ఎవరయినాచూస్తే, అమ్మో, నీ నిర్మలహృదయానికి అపకీర్తితేలేను. ప్రేమకు అర్పించిన నీజీవితాన్ని ప్రపంచానికి వెలిబుచ్చలేను.

మళ్లీ చలికాలంవచ్చి, నన్ను మరీ బాధపెట్టు తుందిదేవీ! పూర్వపు మన ప్రణయఘట్టాలు జ్ఞాపకానికి వస్తూంటే, మబ్బులేని ఆకాశంవైపు, మిణుకుమిణుకు మంటున్న నక్షత్రములవైపు చూస్తూ కూర్చుంటాను. సాధువు యిప్పుడుకూడా వీధులంటా తిరుగుతూ మేలుకొలుపుగీతాలు పాడుతున్నాడా? కోడి పుంజులు అరుస్తున్నాయా? గుళ్లోని కంచుగంట ప్రతిధ్వని స్తుందా? మల్లెపువ్వులు వికసిస్తూన్నాయా? రామ చిలుక పండ్లు తింటుందా? మనం కూర్చుండే బండ చలిలో బాధ పడుతుందా? మనం కూర్చుంటామని అది ఎంతచలికైనా ఓర్చి వుండేదిగదూ. మొదటిలో నీకూ—నాకూ మధ్య నిలబెట్టినగేటువుందా? పాపం అది ఎంత విచారిస్తుందో. ఒకనాడు గేటుకోణాల మీదనుండి నీ చేతులు నా మెడను బంధించినప్పుడు, నీగాజు ఒకటి పగిలిపోయింది జ్ఞాపకం లేదూ? నేను నిన్ను క్షమాపణ కోరానుగదూ?

ఇప్పుడుకూడా అదే time కి లేస్తున్నాను. కాని మేలుకొలుపులు లేవు. గుళ్లోని గంటలు లేవు. అంతకంటె నీ చిలిపిచేతులే నా క్షీణించిన బుగ్గలమీద లేవు. లేచి ఆ చలిలోనే బయట కూర్చుంటాను. ఒకటొకటి జ్ఞాపకానికి వస్తాయి. నాలోనే నవ్వనే కుంటాను. ఉప్పొంగిపోయి పాడుకుంటా, "ప్రేమ మయమీ జీవనమూ" (నీ కిష్టమయినపాట) మళ్లీ అటు వంటిజీవితాన్ని చవిచూడగలనా యని బెంగపెట్టుకొని కన్నీరు కారుస్తాను. తలగడ తడిసిపోయి నా ముఖానికి చల్లదనాన్ని యిస్తూవుంటే, ఆనాటి నీ చల్లనిచేతులు— ముద్దులు—జ్ఞాపకానికి వచ్చి నవ్వుకుంటాను. రంగు రంగులపువ్వులతో నీవు అల్లియిచ్చిన తలగడగలేబు

నన్ను ఎప్పుడూ ముద్దులు పెట్టుకోమని దగ్గఱగా వస్తుంది. ఎప్పుడూ నావద్దనే వుంటానంటుంది.

దేవీ! నీవూ చీకటిలోనే లేస్తున్నావా? నాలాగే విచారిస్తున్నావా? గదిఅంతా బూజు పట్టింది. సూర్య, చంద్ర కిరణాలుకూడా నిర్భయంగా చెలగాటలాడుతున్నాయి గదిలోచేరి. వాళ్లతోపాటు నీ ముద్దుల Photo కిలకిల నవ్వుతుంటుంది. నేను ఎంతసేపు చూస్తున్నాకూడా అలాగే నవ్వుతుంటుంది. చివరికి నేను కన్నీరు రాలుస్తున్నా నవ్వుతుంది. మా దొరగారి బంగళాకెళ్లి, పువ్వులు తెచ్చి, రోజూ నిన్ను పూజిస్తుంటాను. వాడినపువ్వులను నా ప్రక్క మీద పరుస్తా. అవి మెల్లగా చెప్పుతుంటాయిగదా, "అదుగో నీ దేవి వచ్చింది. చూడు. ముద్దుబెట్టుకో." ఎవరో వచ్చినట్లు, ఎవరోకాదు, నీవు వచ్చినట్లే, గుమ్మంవైపు తొంగి చూస్తాను వచ్చావేమోయని. నా ప్రక్కమీద కూర్చుండి నా నొసటిని శాంతిపరుస్తూ నా తలలోనికి పోనిచ్చే నీ చేతులను గట్టిగా పట్టుకోబోతాను. కాని—ఎవరూ కనుపించరు. ఈలాగే రోజూ వస్తూ వుంటావు. పోతూవుంటావు. ఎప్పుడో ఒకసారి గట్టిగా పట్టుకొని కౌగలించుకోవాలనుకొని నిర్ధారణ చేసుకున్నా—అంతే! రోజూ ఆఫీసుకు వెళ్లుతానన్న మాటేగాని, అక్కడ నేను చేసేపనిఏమిటో, time ఎంత అయిందో, ఎవరితో ఏలాగు మాట్లాడుతున్నానో కూడా నాకు అర్థంకావటంలేదు. అసలు నేనెవరనో నాకే తెలియటంలేదు.

దేవీ! నీవు ఎప్పుడూ నాదగ్గరే వుండరాదూ? నేను, నా జీవితాన్నే మరచిపోతాను. నీవు వచ్చినట్లు వెలుగునీడలు చూస్తాను. నీ కిలకిల నవ్వులు వింటూ ఉంటాను. ఎప్పుడో నాకు తెలియకుండానే వచ్చి నా శిథిలమందిరాన్ని అలంకరిస్తారని ఆశాసౌధాలు నిర్మిస్తాను.

రావూ? దేవీ! నిన్నే! ఒక్కసారి నీ దర్శనమియ్యవూ? నన్ను ధన్యుని జేయవూ? చివరిసారి నిన్ను ఎప్పుడు చూచానో తెలుసా? నీవు ఆ నాడు Train లో వెళ్లిపోతూ, రుమాలు వూపుతూ, దూరం అయిపోతున్నానని, జ్ఞాపకార్థం, నీవు అర్పించిన రెండు కన్నీటిబిందువులు యింకా Platform మీద మెరుస్తూనేవున్నాయి దేవీ: ఆ Train క్రింద నేపడి ప్రాణాలర్పిస్తే ఎంత ధన్యుణ్ణి.

నీతోటిసాంగత్యమే నాకు ప్రపంచం — ఉద్యోగం—గడింపు—కీర్తి—రచనలు. సర్వం నీవే. నీవు లేనప్పుడు నేనెందుకు ఈ మాయాప్రపంచంలో. నాగరీకులమని విర్రవీగుతున్నారు ప్రజలు. కాని, తెలిసి, అర్థంచేసుకొని, విడగొట్టడానికి కంకణంకట్టే ఈ పిశాచలోకంలో వుండడంకంటే, ఆశలు, ఆకలి లేని మరొకప్రపంచంలోకిపోయి హాయిగా నిదురిస్తా.

కడసారి ముద్దులు.

ప్రియుడు

నీ

భగవాన్

ఆకర్షణీయమైన! అందమైన!!

బ్లాకులు

కావాలంటే!!

త్రివర్ణబ్లాకులుగాని, హాఫ్‌టోన్ బ్లాకులకుగాని, లైను బ్లాకులకుగాని, ఆంధ్ర దేశమునకు చిరపరిచితులైనట్టియు, సుప్రసిద్ధులైనట్టియు, విజయా ప్రాసస్ వారికే వ్రాయండి.

VIJAYA PROCESS,
34, Varada Iyir st.
G. T. MADRAS.